

ట్రాక్టర్ బోల్తా..
విద్యార్థిని దుర్మరణం 2



జాతీయరహదారిపై
లారీ బీభత్సం 2



AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in


## మాజీ మంత్రిని పరామర్శించిన వేముల



**అక్షరటుడే, ఆర్మూర్:** ఆర్మూర్ మాజీ శాసనసభ్యుడు, మాజీ మంత్రి శనిగరం సంతోష్ రెడ్డిని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి పరామర్శించారు. సంతోష్‌రెడ్డి సతీమణి విజయ రెడ్డి సోమవారం హైదరాబాద్ కొండాపూర్‌లోని స్వగృహంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న వేముల ప్రశాంత్ రెడ్డి సంతోష్‌రెడ్డి స్వగృహానికి వెళ్లి విజయ రెడ్డి పార్థివ దేహానికి నివాళులర్పించారు. ఆయన వెంట ఓయూ జేఏసీ నేత, బీఆర్ఎస్ నాయకుడు రాజారాం యాదవ్ ఉన్నారు.





## 'ప్రజావాణి' ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలి

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 177 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్లు కిరణ్ కుమార్, వి.భుజంగరావుతో పాటు ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియా, డీఆర్‌వో గీత, జెడ్పీ సీఈవో సాయాగౌడ్, డీపీవో శ్రీనివాస్ రావులకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా.. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్లు కిరణ్ కుమార్, భుజంగరావు అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ మైనారిటీ సెల్‌లో పదవులకు దరఖాస్తుల ఆహ్వానం

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** కాంగ్రెస్ జిల్లా మైనారిటీ సెల్ ఛైర్మన్, వైస్‌ఛైర్మన్ పదవుల కోసం ఆశావహుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ఈ మేరకు నగరంలోని కాంగ్రెస్ భవన్‌లో డీసీసీ నగర అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ, మైనారిటీ సెల్ జిల్లా అబ్జర్వర్ మహమ్మద్ మోయిన్ ఆధ్వర్యంలో దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ దరఖాస్తులు సమర్పించిన వారి నుంచి అర్హులను స్రూటినీ చేస్తామన్నారు. అనంతరం జిల్లా, నగర ఛైర్మన్‌గా అధిష్టానం ప్రకటిస్తుందన్నారు. జిల్లాలోని అన్ని నియాజకవర్గాలు, డివిజన్ల నుంచి దరఖాస్తులు వస్తున్నాయని సరైన వారిని గుర్తించి ఎంపిక చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో విపుల్ గౌడ్, కార్పొరేటర్ మనోహర్, నయీమ్, ఒబేద్, నవాజ్, అసద్, హర్షద్, ఖయ్యుం, జాఫర్, అద్నాన్ తదితరులు పాల్గొన్నారు.




# సవరణ

రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా భూముల మార్కెట్ విలువను సవరించేందుకు సిద్ధం అయింది. ప్రస్తుతం బహిరంగ విలువకు, ప్రభుత్వ మార్కెట్ విలువకు మధ్య భారీ వ్యత్యాసం ఉంది. దీంతో భూముల క్రయ, విక్రయాల సమయంలో ప్రభుత్వానికి ఆదాయం తక్కువగా వస్తోంది. ఈ క్రమంలో రేట్లను సవరించడంతో ఆదాయం పెంచుకోవాలని సర్కార్ యోచిస్తోంది.

- అక్షరటుడే, భీమ్‌గల్

- తది దశకు అధికారుల కసరత్తు
- త్వరలో ఉత్తర్వులు
- ప్రభుత్వానికి భారీగా ఆదాయం

ఉమ్మడి నిజామాబాద్ జిల్లావ్యాప్తంగా భూముల ప్రభుత్వ మార్కెట్ విలువల సవరణ కసరత్తు తుది దశకు చేరుకుంది. ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్ లోకేష్ కుమార్ ఆదేశాల మేరకు నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల యంత్రాంగం జీవో నెంబర్ 44 ప్రకారం మండల స్థాయి కమిటీలతో మార్కెట్ విలువల సవరణను పారదర్శకంగా నిర్వహిస్తోంది. భూభారతి, ఐజీఆర్ఎస్ పోర్టల్‌లో ఫామ్ 1, 2, 3, 4 అప్డేషన్ ప్రక్రియను అధికారులు వేగవంతం చేశారు.

### కార్యాలయాల వద్ద రద్దీ!

ధరల పెంపు అమల్లోకి వస్తే రిజిస్ట్రేషన్ల ఖర్చు భారీగా పెరుగుతుందనే సమాచారంతో.. ఉమ్మడి జిల్లాలో పలువురు తమ ఆస్తులను రిజిస్టర్ చేసుకుంటున్నారు. దీంతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రద్దీ నెలకొంది. పెరగబోయే భారం నుండి తప్పించుకోవడానికి చాలామంది తమ భూ లావాదేవీలను శరవేగంగా ముగించుకుంటున్నారు.

### 10 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు..

ఉమ్మడి జిల్లాలో 10 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. నిజామాబాద్ టౌన్, నిజామాబాద్ రూరల్, బోధన్, ఆర్మూర్, భీమ్‌గల్, కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డిలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. వీటిలో నిత్యం అనేక డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ అవుతున్నాయి. అంతేగాకుండా తహశీల్దార్ కార్యాలయాల్లో వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ కొనసాగుతోంది. రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వానికి భారీగా ఆదాయం వస్తోంది. నిజామాబాద్ టౌన్, రూరల్, బోధన్, ఆర్మూర్, కామారెడ్డి సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల్లో నిత్యం డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్ల రద్దీ అత్యధికంగా ఉంటుంది. సగటున రోజుకు ఒక్కో కార్యాలయంలో 35 నుంచి 55 వరకు రిజిస్ట్రేషన్ లావాదేవీలు జరుగుతుంటాయి.

### పెరగనున్న ఆదాయం

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ద్వారా గతంలో వార్షిక ఆదాయ లక్ష్యం రూ.108.9 కోట్లుగా ప్రభుత్వం నిర్ణయించగా.. వంద శాతం లక్ష్యాన్ని సులువుగా అధిగమించింది. నాడు మార్కెట్ విలువలు తక్కువగా ఉన్నప్పుడే వందల కోట్ల ఆదాయం రాగా, ఇప్పుడు ఓపెన్ మార్కెట్ ధరలకు అనుగుణంగా ప్రభుత్వ విలువలను సవరిస్తుండడంతో ఉమ్మడి జిల్లా నుంచి రిజిస్ట్రేషన్ల రాబడి ఏకంగా రూ. 150 కోట్ల నుంచి రూ. 180 కోట్లకు పైగా దాటవచ్చని అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా నిజామాబాద్ నగర కార్పొరేషన్ పరిధిలోని నూతన వెంచర్లు, కామారెడ్డి మున్సిపాలిటీ సరిహద్దులు, నేషనల్ హైవే 44 పరిసర ప్రాంతాలు, నుడా పరిధిలోకి వచ్చే వ్యవసాయేతర ల్యాండ్ కన్వర్షన్ ప్లాట్లు ఈసారి ప్రభుత్వ ఖజానాకు భారీగా స్టాంప్ డ్యూటీ రూపంలో రాబడిని తెచ్చిపెట్టనున్నాయి.

### సామాన్యుడి జేబుకు చిల్లు..

ప్రభుత్వానికి వందల కోట్ల రాబడి పెరగడం ఎలా ఉన్నా, సొంత స్థలం లేదా ఇల్లు కొనుగోలు చేయాలనుకునే మధ్యతరగతి ప్రజలపై రిజిస్ట్రేషన్ ఛార్జీల రూపంలో అదనపు భారం పడడం ఖాయంగా కనిపిస్తోంది. వ్యవసాయ భూములు, పట్టణాలు, నగరాలను బట్టి భూముల విలువలను సవరించనున్నారు. కొత్త ధరలు ఈ నెల 28 నుంచి అమలులోకి రానున్నట్లు సమాచారం.



## ఐదుగురు కానిస్టేబుళ్లకు పదోన్నతులు..

**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఐదుగురు కానిస్టేబుళ్లకు హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి లభించింది. ఈ సందర్భంగా వారు సీపీ సాయి చైతన్యను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ పదోన్నతులు బాధ్యతలు పెంచుతాయన్నార. మరింత సమర్థవంతంగా పనిచేస్తూ పోలీసు శాఖకు పేరు తేవాలని ఆయన ఈ సందర్భంగా వారికి సూచించారు. అనంతరం సిబ్బందికి బ్యాడ్జీలు అందజేశారు. పదోన్నతి పొందిన వారిలో ఎండీ ఖలీద్ (బోధన్ పీఎస్), డి. గౌరీశంకర్ (6వ పీఎస్), బి.శివ కుమార్ (సీసీఆర్‌బీ, నిజామాబాద్), బి.దూప్ సింగ్ (నందిపేట్), శ్రీనివాస్ (రైల్వే సికింద్రాబాద్) ఉన్నారు.



## తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి గీత అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. జూన్ 2న జరిగే రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుక సందర్భంగా చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి ఆయా శాఖల వారీగా అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా అట్టహాసంగా వేడుకలు జరిగేలా ఆయా శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. సమావేశంలో నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్ర కుమార్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## గాంధారిలో ఈదురుగాలుల బీభత్సం..

**అక్షరటుడే, గాంధారి:** గాంధారిలో ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. భారీగాలులతో కూడిన వర్షం కారణంగా విద్యుత్ స్తంభాలు వైర్లు తెగిపోయి పలువురి ఇళ్లపై పడ్డాయి. మరోచోట ట్రాన్స్‌ఫార్మర్ నేలకొరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గాంధారి మండలంలోని గుర్జల్ గ్రామంలో ఒక్కసారిగా ఈదురుగాలులు వీయడంతో నాలుగు విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. వాటి వైర్లు తెగి ఒక ఇంటిపై పడడంతో ఇంటిసభ్యులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. అయితే ఎలాంటి ప్రమాదం సంభవించకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. భారీగా వీచిన గాలికి ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు స్తంభాలు కూడా నేలకొరగగా.. కేంద్రాల్లో ధాన్యం తడవకుండా కాపాడుకునేందుకు ఉంచిన టార్పాలిన్లు సైతం కొట్టుకుపోయాయి. అంతేకాకుండా చెట్లు కూడా నేలకొరిగాయి. సమాచారం అందుకున్న విద్యుత్ శాఖ అధికారులు వెంటనే విద్యుత్ సరఫరా నిలిపివేసి ప్రాణనష్టం జరగకుండా చూశారు. నష్టం వివరాలు తెలియాల్సి ఉంది.





## 'పేరు' లేని పంచాయతీ భవనం..



గాంధారి మండలంలోని నాగులూర్‌లో పంచాయతీ భవనానికి కొత్తగా రంగులులేశారు. అప్పటి నుంచి జీపీ భననానికి పేరు రాయించడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని గ్రామస్థులు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి జీపీకి నేమ్ బోర్డు ఏర్పాటు చేయించాలని కోరుతున్నారు.

– అక్షరటుడే, గాంధారి

## కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తాం: సుదర్శన్ రెడ్డి

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో కాంగ్రెస్ ప్రభుత్వం పలు పథకాలు అమలు చేస్తోందని ప్రభుత్వ సలహాదారు, ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. మహిళా సంక్షేమ వారోత్సవాన్ని పురస్కరించుకుని మండల మహిళా సమాఖ్యలకు ప్రభుత్వం కేటాయించిన ఆర్టీసీ అద్దె బస్సులను కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి కలెక్టరేట్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. మహిళల అభ్యున్నతి కోసం ప్రభుత్వం విరివిగా రుణాలు అందించడమే కాకుండా సోలార్ విద్యుత్ ప్లాంట్లు, పెట్రోల్ బంకులు, ఆర్టీసీ అద్దెబస్సులు, స్కూల్ యూనిఫాంల స్టిచింగ్, ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ వంటి ద్వారా మహిళల ఆర్థిక ప్రగతికి తోడ్పాటును అందిస్తోందని గుర్తు చేశారు. ఇందిరమ్మ ఇళ్లను, రేషన్ కార్డులను కూడా మహిళల పేరిట మంజూరు చేస్తోందని తెలిపారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండున్నరేళ్లలోనే కేవలం నిజామాబాద్ జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల పరిధిలోని మహిళా స్వయం సహాయక సంఘాలకు.రూ. 1,100 కోట్ల ఆర్థిక సాయం అందించిందన్నారు. ప్రజలు వాస్తవాలను గమనించాలని, సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు పెద్దపీట వేస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, సహకార యూనియన్ లిమిటెడ్ ఛైర్మన్ మానాల మోహన్ రెడ్డి, డాక్టర్ కవితా రెడ్డి, అదనపు కలెక్టర్ భుజంగరావు, డీఆర్డీఏ సాయన్న, ఆర్టీసీ ఆర్ఎం జ్యోత్స్న, డీసీసీ అధ్యక్షుడు నగేష్ రెడ్డి, హేమలత పాల్గొన్నారు.




## ఎమ్మెల్యే ప్రోద్బలంతోనే ఆరెకరాల వెంచర్‌కు అనుమతి

**అక్షరటుడే, కామారెడ్డి:** ఎమ్మెల్యే ప్రోద్బలంతోనే కామారెడ్డి పట్టణంలో ఆరు ఎకరాల వెంచర్‌కు కమిషనర్ అనుమతులు ఇచ్చారని టీపీసీసీ జనరల్ సెక్రెటరీ గడ్డం చంద్రశేఖర్ రెడ్డి ఆరోపించారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై సంచలన వ్యాఖ్యలు చేశారు. సందర్భంగా పలు అంశాలపై టీపీసీసీ జనరల్ సెక్రెటరీ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇటీవల ఎమ్మెల్యే ఏర్పాటు చేసిన రివ్యూ సమావేశం నిధులు తీసుకువచ్చి వాటిపై సమీక్ష చేసి ఉంటే బాగుండేదన్నారు. గతంలో ఆరుగురు కౌన్సిలర్లు ఉంటే చివరి వరకు కూడా రూ.లక్ష రూపాయల పని కూడా జరగలేదని, ఇప్పుడున్న 16 మంది కౌన్సిలర్లకు కూడా పైసా పని ఇవ్వలేదన్నారు. కామారెడ్డికి కొత్తగా వచ్చిన మున్సిపల్ కమిషనర్ ఛార్జ్ తీసుకోగానే ఆరు ఎకరాల వెంచర్‌కు ఫీజ్ ఇంటిమేషన్ ఇచ్చి అనుమతులు జారీ చేశారన్నారు. అయితే ఈ వెంచర్ ఎవరిది.. అంత తొందరగా అనుమతులు ఎందుకు ఇచ్చారని విచారణ చేస్తే అనేక విషయాలు వెలుగులోకి వచ్చాయని తెలిపారు. సదరు వెంచర్ నిజామాబాద్ కు చెందిన సుభిషి డెవలపర్స్‌కు చెందినదిగా తెలిపారు. సదరు డెవలపర్స్ వెంచర్‌కు అనుమతి ఇవ్వాలని కమిషనర్‌కు ఎమ్మెల్యే ఫోన్ చేసి చెప్పగానే ఇచ్చేశారన్నారు. ఇటీవల నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలకు కేవీఆర్ ఫౌండేషన్, సుభిషి డెవలపర్స్ ఆధ్వర్యంలో బెంచీలు వితరణ చేయడం జరిగిందన్నారు. బెంచీల వితరణకు సుభిషి డెవలపర్స్ ఆర్థిక సహాయం చేసిందని, దానికి కృతజ్ఞతగానే వెంచర్‌కు ఎమ్మెల్యే అనుమతి ఇప్పించారన్నారు. అయితే వెంచర్ అనుమతిపై కమిషనర్ మాటలు పద్ధారని, దీనిపై దృష్టి మరల్చేందుకే మున్సిపల్ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష చేశారని ఆరోపించారు. పాత టీపీవోతో సదరు వెంచర్ ఫైల్ మొత్తం తయారు చేయించింది ఎమ్మెల్యేనని ఆరోపించారు. మరో మూడు వెంచర్లు అప్రూవల్‌కు వచ్చాయని, వాటి ద్వారా వచ్చే అవినీతి డబ్బు ఇతర వారికి మళ్లిస్తున్నారని ఆరోపణలు చేశారు.





## రైతులకు సబ్సిడీపై జీలుగ విత్తనాలు పంపిణీ

**అక్షరటుడే, ఆర్మూర్:** ఆర్మూర్ మండలం పిప్రి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలోని రైతులకు సబ్సిడీపై జీలుగ విత్తనాలను సొసైటీ ఛైర్మన్ సోమ హేమంత్ రెడ్డి సోమవారం పంపిణీ చేశారు. పిప్రి, మంథని, అందపూర్, మగ్గిడి, ఖానాపూర్ గ్రామాల రైతులు విత్తనాలను కొనుగోలు చేశారు. భూసార పరిరక్షణకు, పచ్చిరొట్ట ఎరువుగా జీలుగ సాగు ఎంతో మేలు చేస్తుందని ఈ సందర్భంగా ఛైర్మన్ హేమంత్ రెడ్డి రైతులకు వివరించారు. కార్యక్రమంలో సొసైటీ వైస్ ఛైర్మన్ గుండా లింగన్న, సర్పంచ్ బందెల కిరణ్, ఉప సర్పంచ్ ఆకుల శ్రీనివాస్, డైరెక్టర్లు సంతోష్, మహేష్, నర్సయ్య, సంజయ్, వార్డు మెంబర్ విజయ్, సీఈవో హన్మాండ్లు, రైతులు పాల్గొన్నారు.

## బాల్కొండ పీఎంశ్రీ జడ్పీహెచ్ఎస్‌లో ముగిసిన సమ్మర్ క్యాంప్..




**అక్షర టుడే, బాల్కొండ:** బాల్కొండ పీఎంసీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల కోసం నిర్వహించిన 15 రోజుల వేసవి శిక్షణ శిబిరాలు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బాల్కొండ ఎస్‌హెచ్‌వో శైలేందర్ మాట్లాడుతూ సమ్మర్ క్యాంప్‌లు విద్యార్థుల్లో సృజనాత్మకత, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు దోహదపడతాయని తెలిపారు. విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, లక్ష్య సాధన దిశగా కృషి చేయాలని సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాల ఛైర్మన్ లత మాట్లాడుతూ శిబిరం ద్వారా విద్యార్థులకు ఎంతో ప్రయోజనం చేకూరిందన్నారు. ఎంఈవో బట్టు రాజేశ్వర్ మాట్లాడుతూ యోగా, నృత్యం, సంగీతం, స్పోకెన్ ఇంగ్లిష్, వ్యక్తిత్వ వికాసం వంటి అంశాల్లో శిక్షణ ఇవ్వడం జరిగిందని తెలిపారు. శిబిరంలో యోగా శిక్షకుడు సల్లగరిగే అశోక్, నృత్య-సంగీత శిక్షకుడు జైకిషన్, కంప్యూటర్ శిక్షకుడు బిజ్జ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని ఫిర్యాదు




**అక్షరటుడే, ఆర్మూర్ :** ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని బీఆర్ఎస్ నాయకుడు జన్నపల్లి రంజిత్ కోరారు. ఈ మేరకు సోమవారం పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. పట్టణంలోని కేజీబీపీ పాఠశాల ఆవరణలో అక్రమ నిర్మాణంపై ఈనెల 12న ఆర్మూర్ తహశీల్దార్‌తో పాటు మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేయగా 13వ తేదీన వచ్చిన అధికారులు నాలుగు పిల్లర్లను తొలగించారన్నారు. అయితే ప్రస్తుతం గేటు ఏర్పాటు చేసి తిరిగి నిర్మాణ పనులు యథేచ్ఛగా నిర్వహిస్తున్నారని సబ్ కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. తక్షణమే అధికారులు స్పందించి ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించాలని ఆయన కోరారు.

## మొక్కులు తీర్చుకుని వస్తుండగా విషాదం.. ట్రాక్టర్ బోల్తాపడి ఇంటర్ విద్యార్థిని దుర్మరణం



**అక్షరటుడే, కామారెడ్డి:** అదుపు తప్పి చెరువు కట్టపై నుంచి ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ ఘటన రామారెడ్డి మండల కేంద్రంలో ఆదివారం రాత్రి చోటుచేసుకోగా ఓ యువతి మృతి చెందింది. రామారెడ్డి మండల కేంద్రానికి చెందిన నర్సింలు కుటుంబం గ్రామ సమీపంలోని బీరప్ప ఆలయం వద్ద పండుగ చేసి మొక్కులు చెల్లించుకున్నారు. పండుగ పూర్తయ్యాక రాత్రి సమయంలో తిరిగి ట్రాక్టర్‌లో ఇంటికి బయలుదేరారు. ఈ క్రమంలో ట్రాక్టర్ పటేల్ చెరువు కట్టపై నుంచి అదుపు తప్పి కిందకు బోల్తా పడింది. ఈ ఘటనలో ట్రాక్టర్ డ్రైవర్, అతని భార్య, కూతురికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వారిని చికిత్స నిమిత్తం కామారెడ్డికి, అక్కడినుంచి మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్ తరలించారు. అయితే చికిత్స పొందుతూ ట్రాక్టర్ డ్రైవర్ నర్సింలు కూతురు శ్రావ్య(17) మృతి చెందింది. ప్రస్తుతం శ్రావ్య ఇంటర్ మీడియట్ చదువుతున్నట్టుగా తెలుస్తోంది. ప్రమాదంతో రామారెడ్డి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.




సీజన్ ముగియగానే రైతులు వరికొయ్యలను తగలబెట్టడం ఆనవాయితీగా వస్తోంది. కానీ పంట అవశేషాలను కాల్చడం వల్ల భూసారం దెబ్బతినడంతో పాటు వాయు కాలుష్యం పెరిగి పర్యావరణానికి తీవ్ర నష్టం కలుగుతుందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. అన్నదాతలు తమ సాగు పద్ధతుల్లో మార్పు తీసుకురావాలని.. లేకపోతే ఖర్చు భారం పెరుగుతుందని వారంటున్నారు.

– అక్షరటుడే, ఎల్లారెడ్డి

# కలియదున్నితే లాభం

■ వరికొయ్యలను తగలబెడుతున్న రైతులు ■ కాల్చవద్దని పేర్కొంటున్న అధికారులు ■ సాగులో మార్పులొస్తేనే లాభాలు ఉంటాయని సూచన

వరి కోతల తర్వాత మిగిలిన కొయ్యలను తగలబెట్టడం వల్ల నేలలో పంటకు మేలు చేసే సూక్ష్మజీవులు, వానపాములు చనిపోతాయి. దీంతో భూమిలోని సేంద్రియ కర్బనం తగ్గి నేల సారం పూర్తిగా కోల్పోతుంది. నేల గట్టిగా మారి నీటిని నిలుపుకునే శక్తి తగ్గిపోతుంది. దీనివల్ల రైతులు పంట దిగుబడి కోసం అధిక మోతాదులో ఎరువులను వాడాల్సి వస్తుంది. దీంతో పెట్టుబడి కూడా పెరుగుతుంది. ఇష్టానుసారంగా వాటిని కాల్చడం వల్ల పొగ, విషవాయువులు వెలువడి రోడ్లపై ప్రయాణించే వారికి, చుట్టుపక్కల ప్రజలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వాయు కాలుష్యం పెరిగి శ్వాసకోశ సమస్యలు వచ్చే ప్రమాదం ఉంది.

### ప్రమాదాలు, నష్టాలు..

పొలాల్లో మంటలు పెట్టడం వల్ల పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, స్టార్టర్ బాక్సులు, నీటి పైపులు, ఇతర వ్యవసాయ పరికరాలు కాలి బూడిదయ్యే అవకాశం ఉంది. ఒక్కోసారి మంటలు అదుపుతప్పి పక్క పొలాలకు వ్యాపించి పెద్ద నష్టం జరుగుతోంది. గతంలో ఇలాంటి ఘటనలు పలు చోట్ల చోటుచేసుకున్నాయి.



### కలియదున్నడమే మేలు..

రైతులు వరి కోతల తర్వాత పూర్తయ్యాక వరి కొయ్యలను కాల్చకుండా నేలలోనే కల్టివేటర్, రోటవేటర్ల సాయంతో కలియదున్నాలని వ్యవసాయాధికారులు సూచించారు. లేదంటే కొయ్యలు మునిగే వరకు నీటితో ముంచి కల్టివేటర్ సాయంతో దున్నితే సారవంతమైన ఎరువుగా మారుతుందని.. దీనివల్ల నేలలో సేంద్రియ పదార్థం పెరిగి మేలు చేసే సూక్ష్మజీవులు, వానపాముల సంతతి పెరుగుతుందని పేర్కొన్నారు. నేలకు నీటిని నిలుపుకునే శక్తి కూడా మెరుగుపడుతుందంటున్నారు. నేలలో వరి కొయ్యలను కలియదున్నిన తర్వాత కుళ్లిపోవడానికి ఎకరానికి 50 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 15 కిలోల యూరియా వేయాలని సలహా ఇచ్చారు. పంట అవశేషాలను కాల్చడం చట్టరీత్యా నేరమని, పర్యావరణానికి హాని కలిగిస్తుందని గుర్తు చేశారు. రైతులు బాధ్యతగా వ్యవహరించి భూమిని, పర్యావరణాన్ని కాపాడాలని కోరారు.

### కాల్చితే ఉపయోగం ఉండదు

రబీ పంట కోతలు పూర్తయి ఖరీఫ్ సాగుకు రైతులు సిద్ధమవుతున్న తరుణంలో వరి కొయ్యలను, పంట అవశేషాలను పొలాల్లో కాల్చవద్దు. కాల్చితే రైతులకు అనాపైసా ఉపయోగం లేదు. పైగా పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుంది. కొయ్యలను భూమిలోనే కలియదున్నితే భూమిసారం పెరుగుతుంది.

**– ఫిర్దోస్, రుద్రూర్ వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్త**

## మహిళలకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట..




**అక్షరటుడే, ఆర్మూర్:** మహిళల ఉన్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఆర్మూర్ మున్సిపల్ ఛైర్‌పర్సన్ గోనె లహరి అన్నారు. ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ.. మహిళల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని, ఇందిరమ్మ క్యాంటీన్లు, ఇందిరా శక్తి, ఇందిరమ్మ ఇల్లు, ఉచిత బస్సు ప్రయాణం వంటి సంక్షేమ పథకాలతో మహిళలకు అన్ని విధాలుగా అండగా నిలుస్తుందన్నారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని 1,253 సంఘాలకు గాను 12,624 సభ్యులు ఉండగా 22,4508 చీరలు పంపిణీ చేయనున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ కాటిపల్లి వెంకటరెడ్డి, కౌన్సిలర్ సదాక్ వినోద్, మల్లయ్య, మెప్మా ఆర్‌పీ ఉదయశ్రీ, మహిళా సంఘాల ప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

## గుర్తుతెలియని మృతదేహం లభ్యం

**అక్షరటుడే, ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి చౌరస్తాలోని ఓ మడిగెలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో ఆర్మూర్ ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని.. వివరాల కోసం ఆర్మూర్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్సై హర్షత్ తెలిపారు.





## జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం..

■ వరుసగా ఏడు కార్లను ఢీకొట్టిన లారీ

**అక్షరటుడే, డిచ్‌పల్లి:** జాతీయ రహదారిపై లారీ బీభత్సం సృష్టించింది. వరుసగా ఏడు కార్లను ఢీకొట్టింది. ఇందల్వాయి పోలీస్ స్టేషన్ పరిధిలోని చంద్రాయన్‌పల్లి సమీపంలో 44వ నంబర్ జాతీయ రహదారిపై సోమవారం సాయంత్రం ఈ ప్రమాదం చోటు చేసుకుంది. రహదారిపై ఈ ఘటను చూసిన స్థానికులు, ప్రయాణికులు భయభ్రాంతులకు గురయ్యారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ వైపు నుంచి నిజామాబాద్ వస్తున్న ఓ లారీ చంద్రాయన్‌పల్లి వద్ద ఆకస్మాత్తుగా ఆగిపోయింది. దీంతో ఆ లారీ వెనక ఉన్న సుమారు ఏడు కార్లు కూడా స్లో అయ్యాయి. అయితే ఈ కార్ల వెనక ఉన్న ఎరువుల లారీ మాత్రం వేగాన్ని అదుపు చేయలేక ఈ ఏడు కార్లను ఢీకొట్టింది. ప్రమాదంలో కార్లు ఒకదానికొకటి ఢీకొని కొంతదూరం వరకు నెట్టుకెళ్లాయి. ఈ ఘటనలో పలు కార్లు పూర్తిగా ధ్వంసం కాగా అందులో ఉన్నవారికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు స్పందించి 108కు సమాచారం ఇవ్వగా స్పందించిన వారు క్షతగాత్రులను జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కార్లలో ఉన్న వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ప్రమాదానికి సంబంధించి పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని ఇందల్వాయి ఎస్సై సందీప్ తెలిపారు.

## ప్రతిభ గల విద్యార్థులకు సంపూర్ణ సహకారం..



**అక్షరటుడే, ఆర్మూర్:** ప్రతిభ గల విద్యార్థులకు ఆర్థిక ప్రోత్సాహం అందిస్తామని అంకాపూర్ గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కుంట గంగారెడ్డి, కార్యదర్శి జంగం మురళి అన్నారు. మహాత్మ జ్యోతిబాపూలే ప్రభుత్వ పాఠశాలలో చదివి పదో తరగతిలో 585 మార్కులు సాధించిన అంబటి రాం చరణ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు నాగరాజు, భాస్కర రెడ్డి, వైస్ భాస్కర్, శేఖర్ రెడ్డి, సాయ రెడ్డి, సంతోష్, లింగారెడ్డి, లింగన్న పాల్గొన్నారు.



## ఎస్సెస్సీ టాపర్లకు సత్కారం..

**అక్షరటుడే, ఆర్మూర్:** ఆలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్సెస్సీలో ప్రతిభ చూపిన విద్యార్థులను సర్పంచ్ ముక్కెర విజయ్ నగదు బహుమతులతో సత్కరించారు. 548 మార్కులతో రవ్యకృతి మండలంలో ప్రథమ స్థానం సాధించగా..ఆమెకు రూ.5వేలు అందించారు. అలాగే ద్వితీయ స్థానం సాధించిన కీర్తన, సద్గుణలకు, తృతీయ స్థానం సాధించిన వైభవికి సైతం నగదు అందజేశారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామంలోని విద్యార్థులు విద్యలో మరింత రాణించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంఈవో నరేందర్, ఉపాధ్యాయులు రాజేష్, వార్డ్ మెంబెర్లు ప్రవీణ్, రాము, రంజిత్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.



## గ్రామ సంఘాల భవన నిర్మాణాలకు భూమిపూజ

**అక్షరటుడే, బాల్కొండ:** మండలంలోని చిట్టాపూర్, బాల్కొండ, కిషన్ నగర్ గ్రామ సంఘాల భవన నిర్మాణాల కోసం సోమవారం భూమిపూజ కార్యక్రమాలు నిర్వహించారు. చిట్టాపూర్‌లో సర్పంచ్ ప్రవీణ్, ఉప సర్పంచ్ ఉదయకుమార్ భూమిపూజ చేశారు. గ్రామ సంఘాల అభివృద్ధి, మహిళా సాధికారత కోసం ఈ భవనాలు ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం గంగారాం, సీసీ సాయన్న, గ్రామ సంఘం అధ్యక్షురాలు హసీనా బేగం, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు..

**అక్షరటుడే నిజామాబాద్ క్రైం/మెండోరా:** హత్య కేసులో నిందితుడికి ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టు జీవితఖైదు విధించింది. ఈ మేరకు పోలీస్ కమిషనర్ సాయిచైతన్య సోమవారం వివరాలు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మెండోరా మండలంలోని బుస్సాపూర్ గ్రామానికి చెందిన సుద్ద లింగన్న 2021 ఆగస్టు 27న స్థానిక బస్టాండ్ వద్ద టీ తాగుతున్నాడు. అదే సమయంలో నిందితుడు సోమనవీన్ గురడికాపు బొర్రయ్య అనే వ్యక్తి మోటార్ సైకిల్‌కు నిప్పు పెట్టాడు. అయితే దీనిపై లింగన్న, బొర్రయ్య నవీన్‌ను ప్రశ్నించారు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన నవీన్ గొడ్డలి, కొంకితో లింగన్నపై దాడి చేశాడు. దీంతో లింగన్నకు తీవ్ర గాయాలు కాగా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన మృతి చెందాడు. కేసు నమోదు చేసిన మెండోరా పోలీసులు సాక్ష్యాధారాలను కోర్టులో సమర్పించగా విచారించిన ఎస్సీ, ఎస్టీ కోర్టు రెండో అడిషనల్ సెషన్ జడ్జి నారాయణ నిందితుడు నవీన్‌కు జీవిత ఖైదుతో పాటు రూ.2వేల జరిమానా విధించారు. ఈ కేసును సమర్థవంతంగా దర్యాప్తు నిర్వహించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ దయాకర్ గౌడ్, మొదటి ఐవోకే శ్రీధర్ రెడ్డి, మెండోరా ఎస్సై, రెండో ఐవోపీ రఘు (అప్పటి ఏసీపీ ఆర్మూర్), సుహాసిని ఎస్సై ప్రస్తుత మెండోరా పోలీస్ స్టేషన్, లైజనింగ్ ఆఫీసర్ టి గోవింద్, కో డ్యూటీ ఆఫీసర్ ఎస్ రాజు కానిస్టేబుల్, సాగర్ కానిస్టేబుల్, కానిస్టేబుల్ విక్రమ్‌లను సీపీ అభినందించారు.